జోహార్.. అంబేడ్కర్

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో వాడవాడలా నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, వివిధ పార్టీల నాయకులు, సంఘాల నేతలు ఆయా కార్యాలయాల వద్ద ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. –సాక్షి నెట్‌వర్క్


బనగానపల్లె: ఎస్సీ బాలుర వసతి గృహంలో నివాళులర్పిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి


కోవెలకుంట్ల: బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంగోపాల్‌రెడ్డి


డోన్: నివాళులర్పిస్తున్న ఆర్డీఓ నరసింహులు



అవుకు ఎస్సీ కాలనీలో..


బేతంచెర్ల: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు


డోన్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో..


డోన్: తహసీల్దార్ కార్యాలయంలో..


బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో..


ప్యాపిలిలో..


డోన్: నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బనగానపల్లె: ఏపీటీఎఫ్ కార్యాలయంలో..


కొలిమిగుండ్లలో ఎమ్మార్పీఎస్ నాయకులు


సంజామలలో ఎమ్మార్పీఎస్ నేతలు, తహసీల్దార్, ఎంపీడీఓ


బనగానపల్లెలో నివాళులర్పిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

క్లుప్తంగా

చౌడేశ్వరి ఆలయానికి విరాళం


ఆలయాభివృద్ధికి రూ.1.50 లక్షల విరాళాన్ని అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి వాస్తవ్యులు కోరుముట్ల జయరామ్, గంగాదేవి కుటుంబ సభ్యులు రూ.1.50 లక్షల విరాళం ఇచ్చారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులు, వేదపండితులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేల బెలుంకు రూ. లక్ష విరాళం


కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయానికి మదనంతపురానికి చెందిన దాత యాతం లక్ష్మీకాంతరెడ్డి రూ.లక్ష విరాళాన్ని సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ బాలవెంకటరెడ్డికి అందజేశారు. ఆలయాభివృద్ధిలో భాగంగా వంటశాలకు రేకుల షెడ్డు, డైనింగ్ హాల్ నిర్మాణం కోసం దాత విరాళం ఇచ్చారని కమిటీ సభ్యులు చెప్పారు. దాతల సహకారంతో ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దాతను సన్మానించారు. కమిటీ సభ్యులు అన్నయ్య, నాగమల్లేశ్వరరెడ్డి, రఘు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కొలిమిగుండ్ల: స్థానిక లలితా సుందరేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం వైఎస్సార్ సీపీ నేత పేరం సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. నంద్యాల శాంతిరాం ఆసుపత్రికి చెందిన వైద్యులు 40 మందికి కంటి పరీక్షలు చేశారు. పది మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించేందుకు నంద్యాలకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పోరెడ్డి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం మృతి


లక్ష్మీనర్సమ్మ(ఫైల్)

డోన్: పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయిని లక్ష్మీనర్సమ్మ(86) వృద్ధాప్య సమస్యలతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈమె భర్త కూడా ప్రభుత్వ ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. లక్ష్మీనర్సమ్మ మృతిపై ఎంఈఓ ప్రభాకర్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

18న కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 18వ తేదీ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలతో పాటు బెస్ట్ క్యాచర్ రూ.వెయ్యి, బెస్ట్ రైడర్‌కు రూ. వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 9440019802 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన జయకృష్ణ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటకు చెందిన ఓ యువకుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పసల పాపన్న కుమారుడు జయకృష్ణ(23) బెంగళూరులో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆరు నెలల నుంచి ఉద్యోగం లేక ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. మళ్లీ ఉద్యోగం వస్తుందోరాదో అని మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి పాపన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా పల్లకీ సేవ


ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరునికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ప్రభోత్సవం


ఉప్పలపాడులో కంబగిరిస్వామి గ్రామోత్సవం

అవుకు: లక్ష్మీ కంబగిరిస్వామి తిరు కల్యాణోత్సవాలు ముగిసిన అనంతరం శనివారం రాత్రి ఉత్సవ విగ్రహాలు ఉప్పలపాడు గ్రామానికి చేరుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రథం నిర్మాణ పనులు ప్రారంభం


పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: మండల కేంద్రంలో వచ్చే నెల మొదటి వారం నుంచి చెన్న కేశవస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్వామివారి రథం పూర్తిగా దెబ్బతినడంతో నూతన రథం తయారు చేయిస్తానని గత ఏడాది వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.40లక్షల సొంత నిధులతో తయారు చేయించిన రథం విడిభాగాలు ఆదివారం అవుకు గ్రామానికి చేరుకున్నాయి. ఈ మేరకు పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అవుకు మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు సాగరిక

బేతంచెర్ల: ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సాగరిక సూచించారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వేసవిలో ఎక్కువగా నీరు తాగాలని, అవసరమైతే తప్ప ఎండలో తిరగకూడదన్నారు. వడదెబ్బకు గురైన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి వివరించారు. తలనొప్పి, తల తిరగడం, జ్వరం, ఫిట్స్ వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని వైద్యశాలకు తరలించాలని సూచించారు. ఎక్కువగా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లెరూరల్: బనగానపల్లె మార్కెట్ యార్డులో జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జొన్న క్వింటా రూ.3,371 ప్రకారం 30 వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లా వ్యాప్తంగా జొన్న పంట అధికంగా పండించే ప్రాంతాల్లో త్వరలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండలంలోని కనకాద్రిపల్లెకు చెందిన వివాహిత వెన్నపూస శ్రీవిద్యను అత్తింటివాళ్లు వేధిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. శ్రీవిద్య భర్త పవన్‌కుమార్, అత్తమామతో పాటు ఆడపిల్లలు అదనపు కట్నం తీసుకురావాలని తరచూ వేధిస్తుండేవారు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం కట్నం తీసుకురావాలని ఇంటి నుంచి బయటకు పంపించారు. అప్పటి నుంచి ఆమె కనకాద్రిపల్లెలోని తల్లితండ్రుల వద్ద ఉంటోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని శనివారం రాత్రి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. గ్రామానికి చెందిన గంధం సంగీత రావు కుమార్తె గంధం మంజుల శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత బయటకు వెళ్లింది. ఎంత సమయం అయినా తిరిగి రాకపోవడంతో తల్లితండ్రులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థిని బంధువులు, స్నేహితులు దగ్గర ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. సోమవారం బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుని దర్శనం

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సోమవారం గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, నైవేద్య సమర్పణ చేసి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి గౌరిపేట, హనుమాన్‌నగర్, సంజీవనగర్, దేవునిరస్తా, బోయపేట మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ సుజాత శర్మ, కమిటీ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష


కరపత్రాలను విడుదల చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్ టౌన్: అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తతే శ్రీరామ రక్ష అని డోన్ అగ్నిమాపక కేంద్రం అధికారి రంగస్వామి గౌడ్, న్యాయవాది ఆలా మోహన్ రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కేంద్రంలో అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అదితర అంశాలపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1944 ఏప్రిల్ 14న ముంబాయిలోని ఒక ఓడలో జరిగిన అగ్నిప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు విడిచారని తెలిపారు. వారి జ్ఞాపకార్థం ఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ నివాళులర్పించారు.

వాన.. రైతన్నల ఆవేదన



కోవెలకుంట: కోతకు సిద్ధంగా ఉన్న వరి, వర్షానికి తడవకుండా ముందు జాగ్రత్తగా ధాన్యంపై కప్పిన పట్టలు

- వాతావరణంలో మార్పులు
- ఆకాశం మేఘావృతం కావడంతో టెన్షన్
- కోత, నూర్పిడి దశలో వరి


ఆకుమల్లలో తడిచిన మిర్చి బస్తాలు

కోవెలకుంట్ల: ఉపరితల ద్రోణి ప్రభావంతో వర్ష సూచన అన్నదాతను గుబులు రేపుతోంది. సోమవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంది. ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు ఆందోళన చెందారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 3,554 ఎకరాల్లో కర్నూలు, నంద్యాల సోనా, 555 రకానికి చెందిన వరి సాగు చేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 35 వేలు వెచ్చించారు. ఆయా మండలాల్లో వరి కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో వర్షం పడితే దిగుబడులు చేతికందకుండా పోతాయని అన్నదాతలు వాపోతున్నారు. నూర్పిడి చేసిన వడ్లను కల్లాలు, పొలాల్లో ఆరబోసుకున్నారు. వర్షం పడే అస్కారం ఉండడంతో ధాన్యం తడవకుండా పట్టలు కప్పుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. గతంలో రెండుసార్లు అకాల వర్షం కురిసి వరి నేలవాలి నష్టం చేకూరింది. నేలవాలిన వరిని కట్టలు కట్టుకుని కోతకు సిద్ధం చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో మోస్తరు వర్షం కురిసిరా వడ్లు రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవుకులో వర్షం

సంజామల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్న పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడ్డారు. పట్టలు కప్పిన కొంత పంట తడిచిపోయింది.


ఆకులమల్లలో వర్షానికి మిర్చిపై పట్టలు కప్పుతున్న రైతులు